ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 16 జూన్ 2024



మళ్లీ తెరపైకి పైపుల కుంభకోణం..!





కర్నూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):

ఎప్పుడో మరిచిపోయారనుకున్న తుంగభద్ర పుష్కరాల పైపుల మాయం కుంభకోణాన్ని మంత్రి టీజీ భరత్ మళ్లీ తెరపైకి తీసుకు రావడంతో కమిషనర్ భార్గవ్‌తేజ ఒక్కసారిగా తెల్లమొహం వేశారు. ఏం జరుగుతుందోనన్న కలవరం ఇంజనీర్లలో మొదలైంది. ఏడాదిన్నర క్రితం కౌన్సిల్ సమావేశంలో పైపుల మాయం కుంభకోణంపై విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేయించాలని వైసీపీ కౌన్సిలరే డిమాండ్ చేశారు. మేయర్ బీవై రామయ్య, అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు కార్పొరేషన్ స్థాయి అధికారుల విచారణ చాలని మాయ చేశారు. విచారణ జరగకుండా తొక్కిపెట్టారు. ఈ కుంభకోణంపై ఆంధ్రజ్యోతి పలు కథనాల రూపంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. తెరమరుగైందని అందరూ భావించారు. మంత్రి టీజీ భరత్ మళ్లీ తెరపైకి తీసుకురావడంతో అధికారుల్లో ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. రూ.6 కోట్ల పైపుల కుంభకోణం విచారణ నివేదికను మంత్రి టీజీ భరత్‌కు ఇస్తారా? లేదా? చూడాలి.



వీకర్స్ సెక్షన్ కాలనీ పార్కులో ఉంచిన పైపులు (ఫైల్)



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పైపులు (ఫైల్)

ఇది పైపుల కథ

మూడున్నరేళ్ల క్రితం అంటే.. 2020 నవంబరు 20న తుంగభద్రకు పుష్కరాలు వచ్చాయి. డిసెంబరు 7 వరకు జరిగాయి. తుంగభద్ర నదిలో పుష్కర పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తుల కోసం నగర శివారున నదీ తీరంలో మునగలపాడు, మసామసీద్ సమీపంలోని పంప్‌హౌస్, సంకల్‌భాగ్, నాగసాయిబాబా టెంపుల్, దక్షిణ షిరిడి సాయిబాబా టెంపుల్, నగరేశ్వరస్వామి దేవాలయం, రాఘవేంద్రస్వామి మఠం, రాంబొట్ల దేవాలయం సమీపంలో పుష్కర ఘాట్లు ఏర్పాట్లు చేశారు. ఘాట్ల దగ్గర భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, మురుగునీటి పైపులు, మౌలిక వసతులు సహా నగరంలో సుందరీకరణ, రోడ్లు వంటి పనులకు ప్రభుత్వం కార్పొరేషన్‌కు రూ.30 కోట్లు మంజూరు చేసింది. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక మురుగు నీరు మళ్లింపు కోసం హెచ్‌డీ పైపులు కొనుగోలుకు సుమారుగా రూ.6 కోట్లు కేటాయిస్తే.. అందులో రూ.4.20 - 4.50 కోట్ల విలువైన హెచ్‌డీ పైపులు కొనుగోలు చేసినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. పుష్కరాలు ముగిసిన తరువాత ఆ పైపులను వీకర్స్ సెక్షన్ కాలనీ పార్కులో భద్రపరిస్తే.. అగ్ని ప్రమాదంలో కాలిపోయాని ఇంజనీర్లు చెబుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. రూ.28 లక్షల విలువైన పైపులే కాలిపోయాని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన రూ.4 కోట్ల విలువైన పైపులు ఏమైయ్యాయి..? కార్పొరేషన్ ఇంజనీర్ల నుంచి సమాధానం లేని ప్రశ్న ఇది.

తుంగభద్ర పుష్కరాల్లో రూ.కోట్ల విలువైన పైపులు కొనుగోలు చేశారు. ఆ పైపులు మాయమయ్యాయి. దీనిపై విచారణ వేశామని అప్పుడెప్పుడో చెప్పారు. విచారణ ఏమైంది..? ఆ పైపులు ఎక్కడికెళ్లాయి..? సమగ్ర నివేదిక నాకు కావాలి..?

- శనివారం నగర పాలక సంస్థ సమీక్ష సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

- సమీక్ష సమావేశంలో ప్రస్తావించిన మంత్రి టీజీ భరత్
- విచారణ నివేదిక కావాలని ఆదేశం

విచారణ పేరుతో తొక్కి పెట్టారు!

తుంగభద్ర పుష్కరాల్లో కొనుగోలు చేసిన రూ.4.50 కోట్ల విలువైన హెచ్‌డీ పైపులు మాయం చేసి ప్రజా ధనం స్వాహా చేశారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ కుంభకోణం వెలుగులోకి వస్తుందని ఆరోపిస్తూ 2022 జూన్ 16న జరిగిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 12వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కాంత్రికుమార్ నిలదీశారు. విచారణ చేసి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భాగోతాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. విజిలెన్స్ వద్దు.. కార్పొరేషన్ అధికారుల విచారణ చాలంటూ ఆ రోజు సమావేశంలో ఉన్న వైసీపీ మేయర్ బీవై రామయ్య, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అనడంతో కార్పొరేటర్లు ఓకే చెప్పారు. నెలలు గడిచినా విచారణ కమిటీ వేయలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి పలు కథనాల ద్వారా వాస్తవాలు వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు అదే ఏడాది ఆగస్టు 30న కమిషనర్ ఎ. భార్గవ్‌తేజ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ కన్వీనర్‌గా ఏడుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించారు. నెలలు, ఏళ్లు గడిచిపోతున్నా ఈ కమిటీ విచారణ చేపట్టలేదు. విచారణ పేరిట మేయర్ బీవై రామయ్య, వైసీపీ ఎమ్మెల్యేలు తొక్కి పెట్టారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ అధికారులు కాకుండా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ కుంభకోణం వెలుగులోకి వస్తుందని పలువురు కార్పొరేటర్లు అంటున్నారు.

మంత్రి టీజీ ఆదేశంతో అధికారులు విచారణ చేస్తారా..?:



తెరమరుగైందని భావించిన తుంగభద్ర పుష్కరాల పైపుల కొనుగోలు, మాయం వ్యవహారాన్ని సమీక్ష సమావేశంలో మంత్రి టీజీ భరత్ తెరపైకి తీసుకురావడంతో కమిషన్ భార్గవ్‌తేజ, ఇంజనీర్లు, ఇతర అధికారుల్లో కలవరం మొదలైంది. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని టీజీ ఆదేశించారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దీనిపై నిజాయితీగా విచారణ చేస్తారా..? గతంలో మాదిరిగానే తొక్కిపెట్టి మాయ చేస్తారా..? అని పలువురు చర్చించుకోవడం కొసమెరుపు.

పునరావాసం కల్పించండి

- కోట్లకు గోరుకల్లు ప్రజల వినతి
- పంప్‌హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

పాణ్యం, జూన్ 15 : తమకు పునరావాసం కల్పించాలని గోరుకల్లు గ్రామ ప్రజలు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్‌కు తాగునీటి సరఫరా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ సమీపంలోని పంప్‌హౌస్‌ను పరిశీలించి, రూ. 470 కోట్లతో చేపట్టిన పనుల గురించి అధికారులతో చర్చించారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి డోన్ నియోజకవర్గంలోని తాగునీటి ఎద్దడి ఎదుర్కొనే మండలాలకు తాగునీరందిస్తామన్నారు. పనుల జాప్యంపై తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం రిజర్వాయర్‌లో రెండున్నర టీఎంసీల నీటి నిల్వ ఉండడంతో తాగునీరు సరఫరా చేయలేమన్నారు. రిజర్వాయర్ రాతి పరుపు కుంగిపోయి రిజర్వాయర్ కట్ట ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో గోరుకల్లు గ్రామస్తులకు పునరావాసం కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఆర్ ఆర్ ప్యాకేజీ కింద నిరుద్యోగ యువకులకు భృతి, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతోపాటు చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవి, సురేష్, వెంకటేశ్వర్లు, రామఉశేని పాల్గొన్నారు.



తాగునీటి సరఫరా పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఉద్యోగాల పేరుతో మోసం చేశారని ఫిర్యాదు

ఆత్మకూరు, జూన్ 15: ఆత్మకూరు పట్టణానికి చెందిన రాష్ట్ర మాజీ హజ్ కమిటీ చైర్మన్, వైసీపీ నేత మోమిన్ అహ్మద్‌హుసేన్, ఆయన తనయుడు మోమిన్ ముస్తఫా ఉద్యోగాల పేరుతో తమను మోసం చేశారని ఇద్దరు బాధితులు శనివారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2016లో మోమిన్ అహ్మద్‌హుసేన్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నప్పుడు హజ్ హౌస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.5 లక్షలు వసూలు చేసినట్లు కర్నూలులోని గణేష్ నగర్‌కు చెందిన రఫిక్ అనే బాధితులు తెలిపారు. ఈ పోస్టుకు మొత్తం రూ.8 లక్షల డిమాండ్ చేయగా తొలి విడతగా రూ.5 లక్షలు తీసుకున్నారని, ఉద్యోగం పర్మినెంట్ అయితే మరో రూ.3 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ ఉద్యోగం ఊడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము ఇచ్చిన రూ.5 లక్షలు వెనక్కి ఇవ్వాలని కోరుతున్నా స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటకు అర్షత్ అనే యువకుడికి డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.2లక్షలు వసూలు చేశారని, తీరా ఉద్యోగం ఇవ్వకపోవడంతో తాము చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని కోరినా ఫలితం లేకపోయిందని అన్నారు. దీంతో ఈ ఇద్దరు బాధితులు విడివిడిగా ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీ





పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, జూన్ 15 :రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలెక్టర్ కె. శ్రీనివాసులు, జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల బొమ్మలసత్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి తొలిసారిగా విచ్చేసిన మంత్రి ఫరూక్‌ను శనివారం జిల్లా యంత్రాంగం కలిసింది.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడం: మంత్రి బీసీ



ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బనగానపల్లె, జూన్ 15: ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు ఉండవని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి 8:30 గంటలకు బనగానపల్లెకు విచ్చేసిన మంత్రి బీసీకి వేలాది మంది జనం పెట్రోల్ బంకు కూడలిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వైసీపీ మాదిరి టీడీపీ ఎవరిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోదని స్పష్టం చేశారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే మాత్రం చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నో అవమానాలకు గురయ్యామన్నారు. తమ కుటుంబ సభ్యులను కూడా వైసీపీ నాయకులు ఎంతో అవమానకర రీతిలో మాట్లాడారని, వారికి ప్రజలు ఓటు హక్కుతో బుద్ధి చెప్పారన్నారు. బనగానపల్లె నియోజకవర్గం ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించారని, వారి రుణం తీర్చుకుంటామని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిందన్నారు. ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతామన్నారు.





మంత్రి బీసీ బాణసంచా వెలిగిస్తూ అభివాదం తెలుపుతున్న దృశ్యం

మంత్రి బీసీకి జన నీరాజనం

బనగానపల్లె, జూన్ 15: బనగానపల్లెకు వచ్చిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి శనివారం వేలాది మంది టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు శనివారం ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో బాణా సంచా పేల్చి పూలమాలలు, బోకేలు అందించి ఘన స్వాగతం పలికారు. అమరావతి నుంచి బయలుదేరిన మంత్రి బీసీ సోమయాజులపల్లె మీదుగా బేతంచెర్లకు సాయంత్రం 4 గంటలకు చేరుకున్నారు. బేతంచెర్లలో టీడీపీ నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డితోపాటు డోన్ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు మండలం నుంచి కూడా భారీ సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు మంత్రి బీసీకి అభినందనలు తెలిపారు. బనగానపల్లె పట్టణ శివారు నుంచి పెట్రోల్ బంకు కూడలి వరకు బైక్‌లు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. చైతన్య రథంపై బీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులతో పాటు రాష్ట్ర టీడీపీ కార్యదర్శులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా విజయభాస్కరరెడ్డి, కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్‌తో పాటు బీసీ కుటుంబ సభ్యులు ప్రజలకు అభివాదం తెలుపుతూ ఇంటికి చేరుకున్నారు.

మన సత్తా చూపిద్దాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కర్నూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి)

ఐటీ, పరిశ్రమల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ సత్తా ప్రపంచ దేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడో చాటిచెప్పారు. ఆయన మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఐదేళ్లలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చాం. ఇవి సాకారం కావాలంటే పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు రావాలి. ఉన్నవి విస్తరించాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా పారిశ్రామిక ప్రగతి సాధించే కీలక పరిశ్రమల శాఖను నాకు అప్పగించడం గొప్ప సంతృప్తినిచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో, రాయలసీమలో పారిశ్రామిక ప్రగతికి చంద్రబాబు పెద్దపీట వేశారు. సోలార్ పవర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. కియోలాంటి ఎన్నో పరిశ్రమ తీసుకొచ్చారు. జగన్ వచ్చాక పీపీఏలు రద్దు చేసి పారిశ్రామికవేత్తల్లో భయాందోళన కలిగించారు. గుజరాత్ తరహా పారిశ్రామిక ప్రగతి, సింగిల్ విండో విధానం కోసం కృషి చేస్తాను. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేస్తాను. జిల్లాలో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని నియోజకవర్గాల్లో సమస్యలు పరిష్కరిస్తాను.. అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాల్లోకి వెళితే..

- పారిశ్రామిక రంగంలో రాష్ట్ర ప్రగతిని ప్రపంచంలో చాటాలి
- జగన్ రాగానే పీపీఏ రద్దు చేశారు
- పరిశ్రమలు స్థాపన.. విస్తరణకు ప్రాధాన్యత
- పారిశ్రామికవేత్తగా సమస్యలపై అవగాహన ఉంది
- పరిశ్రమల శాఖను ఇవ్వడం మరువలేని సంతోషం
- ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తా
- చంద్రబాబు, లోకేశ్ నమ్మకాన్ని నిలబెడతా
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి: సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కడం.. కీలకమైన పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖను అప్పగించడంపై మీ అనుభూతిని వివరిస్తారా..?

● టీజీ భరత్: అక్షరాలతో వర్ణించలేని, మాటల్లో చెప్పలేని సంతోషం ఇది. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతి ఒక్కరికీ మంత్రి కావాలనే స్వప్నం ఉంటుంది. నేనూ కలగనడం సహజమే. ఆ కలను ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ సాకారం చేశారు. పారిశ్రామికవేత్తగా నాకు అనుభవం ఉన్న పరిశ్రమల శాఖను కేటాయించడం జన్మలో మరవలేని ఆనందం.. గొప్ప సంతృప్తినిచ్చింది.

పారిశ్రామివేత్త, సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు అయిన టీజీ వెంకటేశ్ సలహాలు పాలనలో తీసుకుంటారా..? మీరు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై తల్లిదండ్రులు, భార్య పిల్లలు ఎలా ఫీల్ అయ్యారు..!

● టీజీ: నేను ఈ రోజు మంత్రిగా మీ ముందు మాట్లాడుతున్నానంటే మా నాన్న టీజీ వెంకటేశ్ ప్రోత్సాహమే కారణం. ఆయన అనుభవం నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి పారిశ్రామికవేత్తగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా మా నాన్న సలహాలు తప్పకుండా తీసుకుంటాను. సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి నన్ను పరిచయం చేయిస్తూ.. వీళ్ల నాన్న టీజీ వెంకటేశ్‌ను, భరత్‌ను రాజకీయాల్లో తీసుకొచ్చానని చెప్పారు. మంచి పొలిటీషియన్ అని చెప్పారు. మరువలేని క్షణాలు అవి. నాకు మంత్రి పదవి రావడం, ఎంతో ఇష్టమైన పరిశ్రమలు శాఖను చంద్రబాబు కేటాయించడం మా అమ్మానాన్నలు టీజీ రాజ్యలక్ష్మి, టీజీ వెంకటేశ్, నా భార్య శిల్ప, కుమారుడు విభూ, కూతురు ఆర్య సహా మా అక్కలు జ్యోత్స్న, మౌర్య, బావలు ఎంతో సంతోషించారు. నేను ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఇంట్లో పండుగ వాతావరణ నెలకొంది.

● పరిశ్రమలు ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి..? వాటిని ఎలా పరిష్కరిస్తారు..?

● టీజీ: రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్ర రూ.6 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఏర్పడింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తన పాలన అనుభవంతో రాష్ట్రాన్ని గట్టెక్కించడమే కాకుండా పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం అందించారు. నాడు చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ దావోస్ వెళ్లి ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ సత్తా ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలకు తెలియజేశారు. అమెరికాలోని అయోవా విశ్వవిద్యాలయానికి వెళ్లి విత్తన రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వాలని కోరారు. ఫలితంగా రాష్ట్రానికి కియోలాంటి ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. రాయలసీమలో సోలార్ పవర్ ప్లాంట్లను ప్రోత్సహించారు. మన దురదృష్టం కొద్ది 2019లో జగన్ ప్రభుత్వం రాగానే పీపీఏలు రద్దు చేసి పారిశ్రామికవేత్తల్లో భయాందోళన కలిగించారు. ఈ రంగాన్ని నిర్వీర్యం చేశారు. అమరాజా లాంటి ఎన్నో పరిశ్రమలు తెలంగాణ, తమిళనాడుకు తరలిపోయాయి. పరిశ్రమలు రావాలంటే రాయితీలు, పవర్, నీరు, ల్యాండ్, అనుమతులు ఎంతో కీలకం. ఒక కాల వ్యవధిలో... సింగిల్ విండో విధానంలో ఇవి అందించాలి. మేమున్నామనే భరోసా ఇవ్వాలి. వీటిపై అధ్యయనం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని సాధించేందుకు నా వంతు కృషి చేస్తాను.



రాష్ట్రంలో పారిశ్రామిక రంగం ప్రగతికి ఎలాంటి కృషి చేస్తారు..?

● టీజీ: పారిశ్రామికవేత్తగా కొత్త పరిశ్రమలు ఎలా తీసుకురావాలి, ఉన్నవి ఎలా విస్తరించాలి, పారిశ్రామికవేత్తలు ఎదుర్కొనే సమస్యలు ఎలా పరిష్కరించాలి? అనే విషయాలపై నాకు సంపూర్ణ అవగాహన ఉంది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపనకు పలువురు ఆసక్తి చూపుతున్నారని స్పష్టత వచ్చింది. వారికి ధైర్యం, భరోసా ప్రభుత్వం ఇవ్వాలి. చైనా, సింగపూర్ తరహాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాను. ముఖ్యంగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల్లో అవగాహన పెంచుకొని స్థానిక వనరుల ఆధారంగా ఏ జిల్లాలో ఎలాంటి పరిశ్రమ ఏర్పాటు చేయవచ్చు అనే అంశంపై అధ్యయనం చేస్తాను. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి గుజరాత్ తరహాలో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను. మన రాష్ట్రం సత్తాను ప్రపంచానికి చాటుతా.

● ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తారు..?

● టీజీ: గత టీడీపీ ప్రభుత్వం 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసింది. దాదాపుగా 80 వేల ఉద్యోగాలు కల్పించేలా రూ.80 వేల కోట్లతో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంవోయూ చేసుకున్నారు. జగన్ వచ్చాక పట్టించుకోలేదు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ ఒక్కటే నిర్మాణ పనులు చివరికి వచ్చాయి. జగన్ ప్రభుత్వ విధానం వల్ల నిర్మాణ వ్యయం పెరిగి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ఎవరెవరు ఎంవోయూలు చేసుకున్నారో వారితో చర్చించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తాను.



ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్న మంత్రి టీజీ భరత్

హైదరాబాద్-బెంగళూరుకు మధ్యలో జిల్లా ఉండడంతో పరిశ్రమలు రావడానికి అనుకూలంగా ఉంది.

● ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై శ్రద్ధ పెడతారా..?

● టీజీ: ఎమ్మిగనూరులో చేనేతలు అధికంగా ఉండడంతో టెక్స్‌టైల్ పరిశ్రమలు, ఆదోనిలో కాటన్ మార్కెట్ కేంద్రంగా పత్తి జిన్నింగ్ పరిశ్రమలు, పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో సిమెంట్, గ్రానైట్ పరిశ్రమలు, నందికొట్కూరు, నంద్యాల ప్రాంతాల్లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుకూలతలు ఉన్నాయి. పరిశ్రమలు ఏర్పాటుపై అధ్యయనం చేయాలి. ఆ తరువాత సీఎం చంద్రబాబుతో చర్చించి ముందుకు వెళ్తాం. ముఖ్యంగా మా ఎమ్మెల్యేలతో చర్చించి వారి ప్రతిపాదన మేరకు ముందుకు వెళ్తాం.



● జిల్లాలో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని మంత్రిగా ఎలా ముందుకు వెళ్తారు..?

● టీజీ: ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరితో స్నేహపూర్వక అనుబంధం ఉంది. విజయోత్సవ ర్యాలీకి హాజరయ్యారు. విజయవాడలో ఉన్నందున రాలేకపోతున్నానని బీవీ చెప్పారు. కూటమికి చెందిన ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితో కూడా మంచి అనుబంధం ఉంది. వారందరినీ కలుపుకొని వారి అభిప్రాయం మేరకే వారి నియోజకవర్గాల్లో ముందుకు వెళ్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మాది చంద్రబాబు, నారా లోకేశ్ టీం. సమన్వయం, సమష్టి నిర్ణయాలతో సక్సెస్ వైపే ముందుకు వెళ్తాం. ఏక పక్ష నిర్ణయాలు తీసుకునే ప్రస్తే ఉండదు.

స్నేహితులను బలిగొన్న రోడ్డుప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్
- ఇంటర్ విద్యార్థి, యువకుడి దుర్మరణం
- శోకసంద్రంలో బాధిత కుటుంబ సభ్యులు



శివ (ఫైల్)



గురుస్వామి(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కంటైనర్

ఎమ్మిగనూరు జూన్15: ఎమ్మిగనూరు పట్టణంలోని 167వ జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ ఇంటర్ విద్యార్థి, 20 ఏళ్ల యువకుడు దుర్మరణం చెందారు. స్థానికులు, పట్టణ పోలీసులు వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామానికి చెందిన మాల మునిస్వామి, పార్వతిలకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. ఇందులో రెండో కుమారుడు మాల శివ(18) కడివెళ్ల మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అలాగే నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన నాగేంద్ర, జయలక్ష్మిలకు ముగ్గురు కుమారులు. ఇందులో రెండో కుమారుడు గురుస్వామి(20) ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ బేకరీ దుకాణంలో పని చేస్తున్నాడు. మాలశివ, గురుస్వామిలు ఇద్దరు మిత్రలు. శనివారం వీరిద్దరు మోటారు సైకిల్‌పై మంత్రాలయం వైపు వెళ్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర వెనుక నుంచి వస్తున్న భారీ కంటైనర్ వారిని ఢీకొంది. దీంతో ఇరువురు కంటైనర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం చేరవేశారు. యువకులను ఢీకొట్టిన కంటైనర్‌ను డ్రైవర్ కొంత దూరంలో వాహనాన్ని ఆపి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం రోడ్‌సేఫ్టీ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మిన్నంటింది. పట్టణ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మరణవార్తతో వెనుతిరిగిన తండ్రి: గుడికల్లు గ్రామానికి చెందిన మునిస్వామి భార్యా పిల్లలను ఊళ్లోనే ఉంచి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాదుకు వలస వెళ్తుంటాడు. శివను కడివెళ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించిన అనంతరం శనివారం హైదరాబాదుకు బయల్దేరి వెళ్లాడు. అయితే మార్గమధ్యంలోనే తన కుమారుడు శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త అందింది. దీంతో రోదిస్తూ అక్కడి నుంచి వెనుతిరిగాడు. కళాశాలలో చేరిన రెండు, మూడు రోజులకే శివ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో మోడల్ స్కూల్ విద్యార్థుల్లో కూడా విషాదం నెలకొంది.

19, 20 తేదీల్లో కరువు బృందం రాక

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 15: కేంద్ర కరువు బృందం ఈ నెల 19, 20 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తుందని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం డీఆర్వో చాంబర్‌లో కేంద్ర కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ కరువుకు సంబంధించిన ఫొటోలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో రైతులతో కరువు విషయాలు వెల్లడించేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంది పంట నష్టపోయిన మద్దికెర, ఆలూరు తదితర మండలాల సంబంధిత వ్యవసాయాధికారులు పశుసంవర్ధక శాఖ వ్యవసాయ సిబ్బంది గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది వివరించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే ఫొటో ఎగ్జిబిషన్ పనులను డీపీఆర్‌వో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సీపీవో హిమ ప్రభాకర్ రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన పూజకు బంగారు పీఠాలు

మంత్రాలయం, జూన్ 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో నిత్యం జరిగే సంస్థాన పూజల్లో మూల రాముల పూజలకు ఉపయోగించేందుకు పీఠాలను, రెండు ధ్వజారోహణలు, కిరీటాలను నిర్మాణం చేశారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బంగారు పీఠాలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. విలువైన బంగారు పీఠాలను పూర్ణబోధ పూజా మందిరంలో జరిగిన మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములను పీఠాలపై ఉంచి బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. బంగారు పీఠాలపై ఆసీనులపై దేవతామూర్తులకు తులసి అర్చన, మంగళహారతులు ఇచ్చారు. బంగారు పీఠాలపై స్వామివార్లు ఆసీనులు కాగా భక్తులు చూసి ఆనంద పరవశులయ్యారు.

బొమ్మిరెడ్డిపల్లి హత్య కేసులో నిందితుల అరెస్ట్?

వెల్దుర్తి/పత్తికొండ, జూన్ 15: వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. మే 13న జరిగిన ఎన్నికల సందర్భంగా టీడీపీ-వైసీపీల వర్గాల నడుమ చోటుచేసుకున్న వివాదం హత్యకు దారి తీసింది. గ్రామానికి చెందిన మోదుపల్లి గిరినాథ్ చౌదరి తన తమ్ముడు కళ్యాణచక్రవర్తితో కలిసి దళితవాడ వైపు వెళ్తున్న సమయంలో వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరినాథ్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా ఆయన తమ్ముడు కళ్యాణచక్రవర్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులోభాగంగా హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

వైద్య విద్యార్థుల ర్యాలీ

రాజ్‌విహార్‌లో మానవహారం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 15: కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై వాహనాల స్పీడ్‌ను నియంత్రించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతూ 700 మంది వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్‌విహార్‌లో దాదాపు 2 గంటలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డా.అచ్యుత్, వైస్ ప్రెసిడెంట్ డా.భార్గవ్, డా.సతీష్ మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్ నుంచి రాజ్‌విహార్ రోడ్డు చాలా బిజీగా ఉంటుందని, ఆసుపత్రి, మసీదు, పెట్రోల్ బంకు, ఏటీఎం, బ్యాంకు, మెడికల్ కాలేజీ ఇలా రద్దీ ఉన్న రోడ్డులో వాహనాలు, బస్సులు, ఆటోల స్పీడ్‌ను నియంత్రించాలని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సర్కిల్‌లో 24 గంటలు ట్రాఫిక్ పోలీసులు రద్దీని నియంత్రించాలని కోరారు. ఈ సర్కిల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి వైద్య విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలన్నారు. ఆసుపత్రి నుంచి రాజ్‌విహార్ వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలని, మృతి చెందిన వైద్యవిద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి మసీదు, పెట్రోల్ బంకు వరకు రోడ్డు ఇరుకుగా ఉందని దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.



రాజ్‌విహార్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించిన వైద్య విద్యార్థులు

క్షుద్రపూజల కలకలం..

- ఆకులు, కుంకుమ, పసుపు, నిమ్మకాయలతో పూజలు
- ఆందోళనలో వైద్యవిద్యార్థులు



కర్నూలు జీజీహెచ్‌లోని డైట్ కేంద్రంలో క్షుద్రపూజలు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 15: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. ఆసుపత్రిలోని డైట్ (రోగుల భోజనశాల) ఎదుట ఉన్న రహదారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో కుంకుమ, ఆకులు, వక్కచీటి, ఎర్రని, నల్లని దారాలు, రూపాయి బిల్లలు, నిమ్మకాయలు కోసి వదిలి పెట్టిన ఆనవాళ్లు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆనవాళ్లు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం కోసం వచ్చిన వైద్యవిద్యార్థులు ఈ పూజలను చూసి ఆందోళన చెందారు. డైట్ కేంద్రంలో రాత్రి పూట వీధి లైట్లు వెలగకపోవడం, చీకట్లు కమ్ముకోవడం వల్ల కొందరు క్షుద్ర పూజలు చేసినట్లు వైద్యవిద్యార్థులు చెబుతున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు

- హామీ ఇచ్చిన టీజీ భరత్
- మంత్రిని సన్మానించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు



రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్‌ను సన్మానిస్తున్న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), జూన్ 15: అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం పట్టాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేందుకు సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. శనివారం నగరంలోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ సమావేశ హాలులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసగౌడ్, కోశాధికారి అంజి, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ హరికిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు స్నేహాల్ తదితరులు ఇందులో ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు తప్పక పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

29న జాతీయ లోక్ అదాలత్


పోలీసులు, అధికారులతో సమావేశమైన న్యాయాధికారులు

నందికొట్కూరు, జూన్ 15: ఈనెల 29వ తేదీన నందికొట్కూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య సూచించారు. నందికొట్కూరు కోర్టు ఆవరణలో శనివారం పోలీసు సిబ్బంది, న్యాయవాదులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకోవాలని వారు సూచించారు. సమావేశంలో నందికొట్కూరు పట్టణ, రూరల్ సీఐలు ప్రకాశ్ కుమార్, విజయభాస్కర్, ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు, జూపాడుబంగ్లా, మిడ్తూరు ఎస్ఐలు, కోర్టు పోలీసులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'హోంశాఖ కేటాయించడం అభినందనీయం'

పాములపాడు, జూన్ 15: టీడీపీ ప్రభుత్వం మంత్రి వర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితకు హోంశాఖ కేటాయించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ స్వాములు, న్యాయవాది శ్రీశైలం లీగల్ సెల్ అధ్యక్షుడు బతుకులయ్య, వెంకటస్వామి అన్నారు. పాములపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోంశాఖ కేటాయించడంపై రాష్ట్ర వ్యాప్తంగా మాదిగల తరపున ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద స్థానాన్ని కట్టబెట్టిన చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. త్వరలో వర్గీకరణపై ఒక నిర్ణయాన్ని తీసుకొని మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దానమయ్య, దిబ్బన్న, ఏసన్న, బాలరాజు. మర్రిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ఆత్మకూరు, జూన్ 15: ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్‌లో గల అన్నక్యాంటీన్ భవనాన్ని శనివారం మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్నక్యాంటీన్ భవనాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఈ భవనంలో మెప్మా కార్యాలయం కొనసాగుతుండటంతో మరోచోటికి కార్యాలయాన్ని మార్పు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆతర్వాత అన్నక్యాంటీన్‌కు అవసరమైన ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. ప్రస్తుతం భవనం పటిష్ఠంగా ఉందని, కేవలం ప్లంబర్ పనులు చేపట్టి తాగునీటి సదుపాయాన్ని కల్పించాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం అన్నక్యాంటీన్లను ప్రారంభించేలోగా అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ఈయన వెంట ఏఈ సాహీర్ తదితరులు ఉన్నారు.

'ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల దందా'

నందికొట్కూరు, జూన్ 15: నందికొట్కూరు పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా కొనసాగుతోందని పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ఐ మునిస్వామి, కుమార్ ఆరోపించారు. శనివారం విద్యాసంస్థలు అధికంగా వసూలు చేస్తున్నాయంటూ వాటిని కట్టడి చేయాలంటూ పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈవో ఫైజున్నిస్సా బేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ నందికొట్కూరు మండల పరిధిలో ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. వారి పాఠశాల పేరుతో పుస్తకాలు ముద్రించి స్కూల్ యూనిఫామ్, టై, బెల్టు, ప్రైవేట్ నోట్ పుస్తకాలు అమ్ముతున్నారని అన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు రాజు, బిట్టు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో నిబంధనలు పాటించని ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం వారు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గదుల నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అలాగే పాఠశాలలో సరైన మరుగుదొడ్లు, శానిటేషన్, ఆటస్థలం, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ తదితర ప్రమాణాలు లేనప్పటికీ సంబంధిత అధికారులు మిన్నకుండిపోవడం సరికాదన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వ్యవసాయ కళాశాల హాస్టల్ డే

మహానంది, జూన్ 15: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో శనివారం రాత్రి అట్టహాసంగా హాస్టల్‌డేను నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ వి.జయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చక్కటి వాతావరణంలో వ్యవసాయ విద్యను అభ్యసించడం ఎంతో బాగుందన్నారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు వ్యవసాయ విద్యను అభ్యసించడానికి ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సరికొత్త వంగడాలను సృష్టించి వ్యవసాయ రంగాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డు అసోషియేట్ డీన్ న రసింహారావు, కళాశాల శాస్త్రవేత్తలు విజయభాస్కర్, సరోజినీదేవి, కవిత, నారాయణరావు, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు అభినందన


ఫరూక్‌ను సన్మానిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు


మంత్రి ఫరూక్‌ను కలిసిన టీడీపీ గోస్పాడు మండల నాయకులు


మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 15: మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాలలోని తన నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు శనివారం కలిసి ఆయన్ను సన్మానించారు. ఈసందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు అత్యంత బాధ్యతతో కేటాయించిన న్యాయ, మైనార్టీ శాఖలతో ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఫరూక్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్, కిషోర్, సత్రం రామక్రిష్ణుడు, శ్యామ్ సుందర్ లాల్, బంగి సుందర్శన్ ఉన్నారు.

గోస్పాడు: న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఎన్ఎండీ ఫరూక్‌ను గోస్పాడు మండల టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, చింతకుంట్ల బ్రహ్మానందరెడ్డి, జూలేపల్లె భాస్కర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, గోస్పాడు హుసేని, ఒంటివెలగల భాస్కర్‌రెడ్డి, నెహ్రూనగరం వేమారెడ్డి, వెలుగొండారెడ్డి, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందించారు. మండల పరిస్థితులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

నంద్యాల (నూనెపల్లె): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా సీఎం చంద్రబాబు నాయుడు తొలి అడుగులు వేశారని రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా ఆయన నంద్యాలకు రావడంతో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, వివిధ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాతో సన్మానించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ శబరి


కలెక్టర్, జేసీలకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎంపీ శబరి


ఎంపీ శబరిని కలిసిన బండిఆత్మకూరు మండల నాయకులు


ఎంపీ బైరెడ్డి శబరిని కలిసిన బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు

నంద్యాల కల్చరల్, జూన్ 15: నంద్యాల కలెక్టరేట్‌లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కలెక్టర్ కె.శ్రీనివాసులు, జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

- మెట్టమెదటి సారిగా నంద్యాలకు వచ్చిన సందర్భంగా బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీ బైరెడ్డి శబరికి వేదమంత్రాలతో వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమాఖ్య సభ్యులు ఎంపీ శబరికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బ్రాహ్మణ సేవాసమాఖ్య సభ్యులు నగరడోణ సుధీర్, కార్తికేయ శర్మ, మల్లిక, స్వర్ణలత, రవిశంకర్, రాజశేఖర్, కిరణ్, స్వాతి పరమేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. శనివారం ఎంపీ నంద్యాలలోని తన కార్యాలయానికి చేరుకోగానే బండిఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల నాయకులు అభినందనలు తెలియజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, ఎ.కోడూరు నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి, దేరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగాపురం షేక్ బాబు పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీని కోరారు.

టీడీపీలోకి సర్పంచ్‌లు

నందికొట్కూరు రూరల్/కొత్తపల్లి, జూన్ 15: కొత్తపల్లె మండలం వీరాపురం గ్రామ సర్పంచ్ సరస్వతితో పాటు వంద కుటుంబాలు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల సర్పంచ్ పులిచెర్ల మాశమ్మ, కొత్తపల్లి మాజీ మండల వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకులు పోత సహదేవుడు ఆధ్వర్యంలో 20 కుటుంబాలతో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమాల్లో రామిరెడ్డి, కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, రామగిరి, తిరుమల, వెంకటరమణ, ఆచారి, రామకృష్ణ, వెంకటయ్య, శంకర్, నాగేశ్వరరావు, రాజు, పాండురంగయ్య, తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి


మిడుతూరు: సుంకేసులలో సామన్న మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు: మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తిమ్మాపురం స్వామన్న(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సుంకేసుల గ్రామానికి చేరుకుని సామన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, గ్రామ నాయకుడు భూపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.


అల్లూరులో టీడీపీలో చేరిన వీరాపురం, గువ్వలకుంట్ల సర్పంచ్‌లు, నాయకులతో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు

వెలుగోడు, జూన్ 15: వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామంలో శనివారం ఓ కుక్క ఇద్దరు చిన్నారులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలోని సంగమేశ్వర కాలనికి చెందిన పెద్దబాబు రాజ్యలక్ష్మి కుమారుడు చందు ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఓ కుక్క చందుపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. ఈ దాడిలో చందు వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. బాధిత చిన్నారిని వెలుగోడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైత్యం కోసం నంద్యాలకు తరలించారు. అలాగే ఎస్టీ కాలనీలోని మరో చిన్నారిని ఆ కుక్క గాయపరిచింది.

'నాణ్యమైన ఎరువులు విక్రయించాలి'

బండిఆత్మకూరు, జూన్ 15: రైతులకు ఎరువుల దుకాణాల డీలర్లు నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని ఏవో స్వాతి ఆదేశించారు. బండిఆత్మకూరులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ అమ్మకాలకు సంబంధించిన బిల్లులు రైతులకు అందజేయా లని, రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నకిలీ ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీలకు మహానందీశ్వరుని జ్ఞాపిక


న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి మెమెంటోలు అందచేస్తున్న మహానంది ఆలయ ఈవో తదితరులు

మహానంది, జూన్ 15: ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ నూతన క్యాబినెట్‌లో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిలను మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఆలయ వేదపండితులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నంద్యాలలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్‌తోపాటు ఎంపీ శబరిలకు ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం ఈవోను శాలువాతో సన్మానించి, మహానందీశ్వరుని మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మహానందికి తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి: డీఈవో


వడ్డెమాను పాఠశాలలో విద్యార్థినులను బడిలో చేర్పిస్తున్న డీఈవో

నందికొట్కూరు రూరల్, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం నందికొట్కూరు మండలంలోని మల్యాల, వడ్డెమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వడ్డెమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామంలోని ఇద్దరు విద్యార్థులను శ్రీవల్లి, రత్నమ్మను మూడో తరగతిలో చేర్పించారు. ఉపాధ్యాయులు పిల్లల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలు, విద్యార్థులకు కల్పించే పథకాలు తెలియజేసి చైతన్య పరిచి గ్రామంలో ఉన్న విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని కోరారు. డీఈవో మాట్లాడుతూ బడి బయట చదువుకునే పిల్లలు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో దాదాపు 16 మంది విద్యార్థులను చేర్పించినందుకు డీఈవో ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం మల్యాల పాఠశాలలో నాడు నేడు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన నాడు నేడు పనులను పూర్తి చేయాలని, అందుకు కావాల్సిన నిధుల గురించి చర్చించారు. అదేవిధంగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు వెంటనే చేర్చాలని ఆదేశించారు. స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేయాలన్నారు. ఎంఈవో ఫయజున్నీసా బేగం, వడ్డెమాను ఇన్‌చార్జి హెచ్ఎం రఫీఅహ్మద్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, కోటిరెడ్డి, నాగసుశీల శివమ్మ తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఉర్దూ బాలికల సంతపేట పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అందుకు కావాల్సిన నిధుల గురించి చర్చించారు. అదే విధంగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించినటువంటి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను పాఠశాలకు వెంటనే చేర్చాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన నోటు పుస్తకాలు, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఫైజున్నీస్సా బేగం తదితరులు ఉన్నారు.

'భావి పౌరులుగా తీర్చిదిద్దాలి'

వెలుగోడు, జూన్ 15: విద్యార్థులకు చిన్న తనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనందించి భావి భారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చి దిద్దాలని అబ్దుల్లాపురం గ్రామ టీడీపీ నాయకులు ఉదారు రామలింగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలను శ్రద్ధగా విని బాగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. బాగా చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, నాయకులు చిలుక నాగస్వామి, నాగస్వామి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేసీ కెనాల్

- రక్షణ గోడ కూలడంతో ఆందోళనలో రైతులు


శాతనకోట వద్ద కూలిన కేసీ కెనాల్ రక్షణ గోడ

నందికొట్కూరు రూరల్, జూన్ 15: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామ పరిధిలో గల కేసీ కెనాల్ రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. శాతనకోట వద్ద 72వ స్లూయిస్ సమీపంలో కేసీ కెనాల్ రక్షణగోడ శుక్రవారం రాత్రి కూలిపోయింది. గత వారం రోజుల క్రితం కేసీ కెనాల్‌కు తాగు నీటి కోసం తుంగభద్ర డ్యాం నుంచి నీటిని వదిలారు. కానీ అధికారులు కేసీ కెనాల వెంబడి ఏమి జరుగుతుందో గమనించడం లేదని కేసీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం కురిసిన వర్షాలకు, చాలా కాలం నుంచి కేసీ కెనాల్‌కు మరమ్మతులు చేయించకపోవడంతో కెనాల్‌వెంబడి చాలా చోట్ల కోతలకు గురై పగుళ్లు ఇచ్చాయి. కెనాలు లోపలి ప్రాంతం కూడా బేస్‌మెంట్ పూర్తిగా దెబ్బతింది. అధికారులు పట్టించుకోవడం లేదని, ఒకపక్క వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం పనులు చేయడం వల్ల కూడా కేసీ కెనాలు చాలా వరకు దెబ్బతిన్నదని కేసీ ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరిత గితిన కేసీకి రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు. కేసీ కెనాల్ ఏఈ నరేష్‌ను వివరణ కోరగా శాతనకోట వద్ద రక్షణ గోడ కూలిపోయిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని పోయి శ్యాండ్ బ్యాగ్స్‌తో తాత్కాలికంగా రక్షణ ఏర్పాటు చేస్తామని. ఆ తర్వాత పూర్తి స్థాయిలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



'వేగవంతం చేయాలి'

గడివేముల, జూన్ 15: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటర్ ఆఫీసర్ లలితకుమారి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం ఆమె హెచ్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఎంఈవో మేరి సునిత, అసిస్టెంట్ ఏఎంవో యూనిస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో చిరుత సంచారం

మహానంది, జూన్ 15: మహానంది క్షేత్ర పరిసరాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం రాత్రి 10 గంటల సమయంలో చిరుతపులి కనిపించింది. దీంతో మహానందీశ్వరుని దర్శనార్థమై క్షేత్రానికి వస్తున్న భక్తులు భయందోళనకు గురయ్యారు. విద్యుత్ సబ్ స్టేషన్‌కు అత్యంత సమీపంలోని నల్లమల అడవి నుంచి చిరుతపులి రావడం చూసిన స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో పందిని నోట కరుచుకొని తిరిగి అడవిలోకి పారిపోయినట్లు అక్కడున్న వారు తెలిపారు. గత రెండు రోజుల క్రితం మండలంలోని నల్లమలలో చలమ రైల్వే ట్రాక్ ఆధునికీకరణ పనులు చేస్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన మహిళ కూలీ పాండెన్‌ను చిరుతపులి దాడి చేసి గాయపర్చిన ఘటన మరువక ముందే తిరిగి మహానందిలో చిరుతపులి సంచరించడంపై పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కూలిన మిద్దె పైకప్పు

పాణ్యం, జూన్ 15: స్థానిక బస్టాండు సమీపంలో మిద్దె పైకప్పు కూలిన ఘటనలో ప్రాణా పాయం తప్పింది. దుర్గా లాడ్జికి పక్కన చాకలి లక్షమ్మకు చెందిన మిద్దె పైకప్పు శుక్రవారం రాత్రి కూలింది. ఇంటిలో నిద్రిస్తుండగా పైకప్పు నుంచి మట్టి రాలడంతో బయటికి పరిగెత్తినట్లు లక్షమ్మ తెలిపింది. అనంతరం పైకప్పు దంతెలు విరిగి కప్పు కూలినట్లు పేర్కొంది. పాత ఇల్లు కావడంతో కూలిపోయిందని, కొత్తగా కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేదని, ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

కేసీ కాలువలో గుర్రపు డెక్క

పగిడ్యాల, జూన్ 15: ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కేసీ కాలువకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన గేట్ల వద్దకు గుర్రపు డెక్కవచ్చి చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు నాలుగు రోజుల క్రితం కేసీ కాలువకు నీటిని విడుదల చేశారు. దీంతో కేసీ కాలువలో నీటి ప్రవాహంలో భారీగా గుర్రపుడెక్క వచ్చింది. ముచ్చుమర్రి సమీపంలో కేసీ కాలువలో కేట్లు కిందకు దించడంతో కాలువలో కిలో మీటరుకు పైగా గుర్రపుడెక్క గేట్ల వద్ద నిలిచిపోయింది.


ముచ్చుమర్రి సమీపంలో కేసీ కాలువలో గేట్ల వద్ద నిలిచిన గుర్రపు డెక్క

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన నాయకులు



భరత్‌ను అభినందిస్తున్న టీడీపీ, ఆర్యవైశ్య నాయకులు

చాగలమర్రి, జూన్ 15: పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను శనివారం చాగలమర్రికి చెందిన ఆర్యవైశ్యులు, టీడీపీ నాయకులు అభినందించారు. టీడీపీ నాయకులు శంకర సుబ్బారావు, ఎం.సత్యనారాయణ, మధు ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో సన్మానించారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. చాగలమర్రిలో టీటీడీ కల్యాణ మండపం, పార్క్, పరిశ్రమల కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి రూపంలో మంత్రికి అందజేశారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు రామకృష్ణ, లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



తిరుమలలో ఎమ్మెల్యే అఖిలప్రియ

నంద్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ శనివారం దర్శించుకున్నారు. ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సీఎం చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆ తరువాత తిరుపతి వెంకన్నను దర్శించుకున్నారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయా: బిజ్జం



భక్తవత్సలరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బిజ్జం పార్థసారథిరెడ్డి

కొవెలకుంట్ల, జూన్ 15: ఓ మంచి ఆప్తమిత్రుడిని కోల్పోయానని పాణ్యం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన భక్తవత్సలరెడ్డి గత పదేళ్లుగా పట్టణంలో కృష్ణతేజ ఫంక్షన్ హాలు ఏర్పాటు చేసి ఎందరికో సేవలందించారన్నారు. ఆయన చిన్నతనం నుంచి సేవ చేసే తత్వం కలిగిన వ్యక్తి అని అన్నారు. అయితే ఇటీవలనే అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డితో పాటు పలువురు నాయకులు కోవెలకుంట్ల పట్టణంలోని భక్తవత్సలరెడ్డి ఇంటి వద్ద చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో బిజ్జంతో పాటు మురళీధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల గోల్‌మాల్

వేలాన్ని అడ్డుకున్న టీడీపీ నాయకులు

దొర్నిపాడు, జూన్ 15: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ దేవస్థానానికి చెందిన ఆలయ భూముల వేలం పాటలో రూ.3 లక్షలు గోల్‌మాల్ జరిగిందని టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, నారాయణస్వామి, లింగుట్ల వెంకట్‌నాయుడు, బూషిరెడ్డి, తిమ్మరాజు ఆరోపించారు. శనివారం ఈవో చంద్రుడు ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములు వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది 19.81 ఎకరాల భూమికి రూ.7 లక్షలు పాట పాడి గుత్తేదారుడు డబ్బులు చెల్లించారని, అయితే ఆలయ భూముల రికార్డుల్లో రూ.4 లక్షలు పాడినట్లు ఉండటంతో టీడీపీ నాయకులు నిలదీశారు. రూ.7 లక్షలు పాట పాడగా రూ.3 లక్షలు ఏమయ్యాయని ఈవోను ప్రశ్నించి వేలం పాటను నిలిపి వేశారు. ఈ సమస్య పోలీసు స్టేషన్‌కు చేరడంతో ఆలయ భూముల వేలంపాట నిలిపివేశారు. టీడీపీ నాయకుడు మల్లేశ్వరచౌదరి మాట్లాడుతూ రికార్డుల్లో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

'పిల్లలను బడిలో చేర్పించాలి'

దొర్నిపాడు, జూన్ 15: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. శనివారం మండలంలోని అర్జునాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆరేళ్లు పూర్తయిన 8 మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణకుమారి, ఏఎన్ఎం మల్లేశ్వరి, హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు ఉన్నారు.

డోన్(రూరల్): మండలంలోని ధర్మవరం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త జులైఖ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు.

చాగలమర్రి: గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి పేర్కొన్నారు. శనివారం మల్లేవేముల, కేపీ తండా గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే, బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఏడుగురు చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులకు బహుమతులను సీడీపీవో ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పాఠశాల హెచ్ఎం మాధురి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని ముత్తలూరు గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో సమీక్ష నిర్వహించి పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటల విద్యపై వివరించారు. 10 నుంచి 18 ఏళ్ల బాలికలు కూడా విద్య, ఇంకా పలు అం శాలపై అవగాహన కల్పించారు. బాల సభ వల్ల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించుకోగలుగుతారన్నారు. బాల్య వివాహాలు, లింగ వివక్షకు పాల్పడకూడదన్నారు.

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి జన నీరాజనం

- దారి పొడవునా వేలాది మంది స్వాగతం
- కదలివచ్చిన బీసీ స్వగ్రామం యనకండ్ల
- రాత్రి 10 గంటల దాకా సాగిన ర్యాలీ





బనగానపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బేతంచెర్లలో బీసీని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూన్ 15: రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బీసీ జనార్దన్‌రెడ్డికి శనివారం ఘనస్వాగతం లభించింది. వేలాది మంది టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది జనం బీసీకి జన నీరాజనాలు పలికారు. ప్రతిగ్రామంలో పూలు జల్లుతూ బాణాసంచా పేల్చి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రాజధాని అమరావతి నుంచి బయలు దేరిన మంత్రి బీసీ సోమయాజులపల్లె మీదుగా బేతంచెర్ల సాయంత్రం 4 గంటలకు చేరుకున్నారు. బేతంచెర్లలో టీడీపీ నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డితోపాటు డోన్ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు మండలం నుంచి కూడా భారీ సంఖ్యలో మంత్రి బీసీకి అభినందనలు తెలిపారు. బాణాసంచా, పూలమాలలు జల్లుతూ బీసీకి ఘన స్వాగతం పలికారు. బేతంచెర్లనుంచి గోర్లగుట్ట, పలుకూరు క్రాస్‌రోడ్డు, హుసేనాపురం, యనకండ్ల మీదుగా బనగానపల్లెకు 8 గంటలకు చేరుకున్నారు. బనగానపల్లె పట్టణ శివారునుంచి పెట్రోల్‌బంకు కూడలి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీ నిర్వహించి టీడీపీ అభిమానులు బీసీ వెంట పాదయాత్రగా వచ్చారు. బనగానపల్లె పట్టణ శివారు వచ్చే సరికి 8 గంటల సమయం తీసుకుంది. బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు వద్దకు రావడానికి గంటకుపైగా సమయం పట్టింది. బనగానపల్లె పట్టణంలో సాయంత్రం 4 గంటలనుంచే మంత్రి బీసీకోసం జనం వేచి ఉన్నారు. పలుకూరులో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పీవీకుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ అంబాల ప్రభాకర్‌రెడ్డి, గుండం మల్లికార్జునరెడ్డి, హుసేనాపురం వద్ద సర్పంచ్ వరలక్ష్మి, దొనపాటిభాస్కర్‌రెడ్డి, జహంగీర్ నేతృత్వంలో బీసీకి ఘన స్వాగతం పలికారు. అక్కడనుంచి బీసీ స్వగ్రామం యనకండ్లలో ఉప సర్పంచ్ బొబ్బల గుర్రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డితో పాటు గ్రామమంతా బీసీకి జన నీరాజనం పలికారు. యనకండ్లలో చెక్కభజన కార్యక్రమం నిర్వహించారు. అక్కడనుంచి బత్తులూరుపాడులో స్వాగతం పలికారు. అక్కడనుంచి బనగానపల్లెకు చేరుకున్నారు. బనగానపల్లె పట్టణంలో ర్యాలీ రెండుగంటల పాటు సాగింది. వేలాది మంది అభిమానులు క్రేన్‌లతో పూలమాలలతో బీసీకి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు వంగల పరమేశ్వర్‌రెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, అమడాల అభిరుచి మద్దిలేటి తోపాటు పలువురు టీడీపీ అభిమానులు క్రేన్‌లతో మంత్రి బీసీకి స్వాగతం పలికారు. బీసీ తొలిసారిగా మంత్రి హోదాలో బనగానపల్లెకు రావడంతో జనం వేలాదిగా నియోజకవర్గం నుంచి తరలి రావడంతో 3 గంటలపాటు బనగానపల్లెలో ట్రాఫిక్ జాం అయింది. పట్టణంలో చైతన్యరథంపై బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులతో పాటు రాష్ట్ర టీడీపీ కార్యదర్శులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా విజయభాస్కరరెడ్డి, కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్‌తో పాటు బీసీ కుటుంబ సభ్యులు చైతన్య రథంలో ప్రజలకు అభివాదం తెలుపుతూ బీసీఇంటికి చేరుకున్నారు. పెట్రోల్ బంకునుంచి బీసీ ఇంటికి చేరుకునే సరికి గంటకు పైగా సమయంపట్టింది. అభిమానులు పూలు జల్లుతూ, బోకేలు అందించి బీసీని అభినందిచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందో బస్తు నిర్వహించారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం : మంత్రి బీసీ

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని పేదలకు 2 సెంట్లు స్థలం ఇచ్చి ఇచ్చిన మాట నెరవేర్చుకుంటామని ఏపీ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బనగనాపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో బీసీ ఇందిరమ్మతో కలసి ప్రజలను ఉద్దేశించి బీసీ మాట్లాడారు. బీసీ మాట్లాడుతూ తనను గెలిపిచిన ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిందని టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు. పేద, మధ్య తరగతి, అన్ని వర్గాల ప్రజల కోసం తాను నిరంతరం పనిచేసి వారికి సేవలందిస్తామన్నారు. తనను వైసీపీ వారు ఎన్నో అవమానాలు చేశారు. తనపై అక్రమ కేసులు పెట్టారు. చివరకు కార్యకర్తల కోసం జైలుకు కూడా పోయివచ్చానన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీ ఇచ్చారన్నారు. తనను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. వారి రుణం ఈజన్మలో తీర్చుకోలేదన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజవర్గ ప్రజలకు, టీడీపీనాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బనగానపల్లె పట్టణంలోని పేదలకు 2 సెంట్లు స్థలం ఇచ్చి వారి రుణం తీర్చుకుంటామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం బీసీ

బేతంచెర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర మంత్రిగా బనగానపల్లెకు మొట్టమొదటిసారిగా వస్తున్న బీసీ జనార్దన్ రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో సన్మానించారు. బేతంచెర్ల మీదుగా వెళ్తున్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి 60 కార్లలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బేతంచెర్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తనకు ఇంత అపూర్వ ఘన స్వాగతం పలకడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, అధిక సంఖ్యలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసేందుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

కొవెలకుంట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసేందుకు కోవెలకుంట్ల మండలం నుండి తెలుగు తమ్ముళ్లు భారీగా వాహనాల్లో శనివారం తరలివెళ్లారు. బనగానపల్లె నుండి టీడీపీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన జనార్దనరెడ్డి ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో బీసీ స్థానం దక్కించుకుని మంత్రిగా విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మొదటిసారిగా శనివారం సాయంత్రం బనగానపల్లె వస్తున్న సందర్భంగా గోవిందిన్నెమెట్ట వద్ద నుండి బనగానపల్లె వరకు మంత్రి బీసీ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి కోవెలకుంట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

సంజామల: మంత్రి బీసీజనార్దన్ రెడ్డి శనివారం సాయంత్రం బనగానపల్లెకు విచ్చేస్తున్న సందర్భంగా గోర్లగుట్ట సమీపంలో కలిసి ఆహ్వానించేందుకు మండలంలో టీడీపీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. గిద్దలూరు నుంచి మండల టీడీపీ ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, కానాల నుండి కేశవ రెడ్డి, సంజామల నుండి తోకల మద్దిలేటి, ఎగ్గోని నుండి విష్ణువర్దన్ రెడ్డి, ముదిగేడు నుంచి రామ్మోహన్‌రెడ్డి, ముక్కమల్ల నుండి మూసాని చంద్రశేఖర్ రెడ్డి తదితరులు తరలి వెళ్లారు.

కొలిమిగుండ్ల రూరల్: మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి స్వాగతం పలికేందుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు శనివారం తరలి వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఎదురెళ్లి స్వాగతం పలికారు.



మంత్రి బీసీ కోసం వేచి చూస్తున్న కమ్మవారిపల్లె నాయకులు



కొవెలకుంట్లలో బీసీ విజయోత్సవ ర్యాలీకి తరలివెళుతున్న శ్రీరుచి హోటల్ మద్దిలేటి తదితరులు



కమలపురి నుంచి దాట్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గోర్లగుట్టకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



డ్యాన్స్ చేస్తున్న మహిళలు



సంబరాల్లో యువత



బీసీకి స్వాగతం పలుకుతున్న కొలిమిగుండ్ల మండల నేతలు

దుకాణాల కాల్చివేత.. కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 15: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో బట్టల దుకాణాలను కాల్చి వేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి శనివారం వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి దుకాణాలను గ్రామ నాయకులు వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, వీఆర్ అజయ్‌సింహారెడ్డి మరి కొంత మందితో కలిసి గురువారం అర్ధరాత్రి పెట్రోల్ పోసి తగులబెట్టారు. క్రిష్ణమూర్తి కుమారుడు మణికంఠ అడ్డుపడగా అతడ్ని బెదరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై దాడికి యత్నం: కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామంలో గంగుల శ్రీకాంతరెడ్డి అనే వ్యక్తిపై కడప జిల్లాకు చెందిన వాసు దేవరెడ్డి, మరో ఆరుగురు దాడికి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు వెల్లడించారు.

జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

నంద్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో జీర్ణోద్ధరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వచ్చే జూలై 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణం కార్యక్రమాలను చేపడుతున్నట్లు ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్ చెప్పారు. ఈ క్రమంలో శనివారం బాలాలయ కళాకర్షణం చేపట్టినట్లు తెలిపారు. దీంతో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు దిగువ అహోబిలంలోని ప్రహ్లాద వరద స్వామి వారి మూలమూర్తి దర్శనం ఉండదని చెప్పారు. అయితే ఉత్సవమూర్తులను దర్శనం చేసుకోవచ్చని, మహా సంప్రోక్షణం తరువాత దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి లక్ష కుంకుమార్చన

రుద్రవరం, జూన్ 15: మండలంలోని వాసాపురంలో వేంకటేశ్వ ర స్వామి, లక్ష్మి గోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మలు అభిషేకం నిర్వహించి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష కుంకు మార్చనలో పాల్గొన్నారు. మానసలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రెండు దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

వేలంలో పెరిగిన ఆదాయం

రుద్రవరం, జూన్ 15: మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో అంజనేయస్వామి దేవస్థానం భూములకు శనివారం కౌలు వేలం నిర్వహించారు. ఈవో వేణునాథరెడ్డి మాట్లాడుతూ ఈ వేలం పర్యవేక్షకుడు రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించామని చెప్పారు. 22.96 ఎకరాలు భూమి కౌలు వేలం వేయగా రూ3.58 లక్షలు వేలందారులు పాడారు. గత ఏడాది రూ3.08 వేలు వేలంలో ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అదనంగా రూ.50 వేల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎర్రం ప్రతాప్‌రెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోరుకల్లు వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేయండి : కోట్ల

బేతంచెర్ల, జూన్ 15: గ్రామీణ ప్రజలకు ఆగస్టు నెలాఖరులోగా శుద్ధ జలం సరఫరా చేయడానికి గోరుకల్లు వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రూ.355 కోట్లతో జరుగుతున్న గోరుకల్లు రిజర్వాయర్ వాటర్ గ్రిడ్ నిర్మాణం పనులను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శనివారం పరిశీలించారు. పాణ్యం మండలం గాలిమెట్టవద్ద వాటర్ గ్రిడ్ పంపు హౌస్‌ను ఆయన పరిశీ లించారు. అదే విదంగా మండలంలోని బుగ్గానిపల్లె తండా సమీపంలో ఉన్న ట్రీట్మెంట్ నీటి శుద్దీకరణ ప్లాంటు పనులను పరిశీలించి, వివరాలను ఇంజ నీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోట్ల వెంట డీజీఎం వాసు, డీఈ సోమశేఖర్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ఎమ్మెల్యే కోట్ల

- నేటి నుంచి వార్డు పర్యటన

డోన్: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేలా ఎమ్మెల్యే రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఆదివారం నుంచి డోన్ పట్టణంలో వార్డు పర్యటన చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకే పట్టణంలోని కొండపేట బీసీ హాస్టల్ వార్డు ప్రాంతంలో ఎమ్మెల్యే కోట్ల పర్యటించనున్నారు.

అక్రమ మద్యం, గంజాయి వ్యాపారాలను నిర్మూలిస్తాం : కోట్ల

ప్యాపిలి: వైసీపీ పాలనలో విచ్చల విడిగా సాగిన గంజాయి, అక్రమ మద్యం వ్యాపారాలను నిర్మూలిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంతి భవనంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు, భూదందాలకు తావివ్వమన్నారు. ఇటువంటి దౌర్జన్యాలు ఎక్కడ జరిగినా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై నాగేశ్వరరావు యా దవ్, వలసల రామక్రిష్ణ, గండికోట రామసుబ్బయ్య, టి శ్రీనివాసులు, రామ్మోహ న్‌యాదవ్, అంకిరెడ్డి, ఖాజాపీర్, ఎస్ మధు, నాగేంద్ర, మధుకుమార్ పాల్గొన్నారు.



శుద్ధజల ప్లాంటును పరిశీలిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

సంజామల, జూన్ 15: ఆకుమల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన తేజేశ్వర్ అనే విద్యార్థికి శనివారం పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహ బహుమతిని అందజేశారు. పూర్వ విద్యార్థులు సనిగొండ్ల వీరభద్ర రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వివేకానంద రెడ్డి, శ్రీనులు కలిసి పాఠశాలలో విద్యార్థి తేజేశ్వర్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థులను ప్రోత్సహించడం హర్షణీయం

అవుకు, జూన్ 15: అవుకు మండల సంగపట్నం గ్రామానికి చెందిన కరణం శివరామకృష్ణ విద్యార్థులను ప్రతి సంవత్సరం ప్రోత్సహించటం హర్షణీయమని సంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషాచలం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2023-- 24 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి హర్షవర్దన్‌కు రూ.10వేలు, విద్యార్థిని లలితకు రూ.2000, మరో విద్యార్థిని లావణ్యకు రూ.1000 నగదుతోపాటు మెమెంటోలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, నరేష్ బాబు, సుబ్బారావు, షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ సహాయకుల శిక్షణ ప్రారంభం

నంద్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సహాయకులు శనివారం శిక్షణ ప్రారంభమైంది. సబ్ డివిజన్ పరిధిలోని సహాయకులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి పశుసంవర్ధక శాఖ డైరెక్టర్లు, అసిస్టెంటు డైరెక్టర్లు ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూన్ 15: గ్రామాల్లో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటమ్మ సూచించారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని 16వ వార్డులో వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధుల గురించి తెలియజేశారు. ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్ శివలక్ష్మి, వైద్య సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు

నంద్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని కాశీచింతల క్షేత్రంలో నిర్మితమైన ఉత్తర శబరిమల అయ్యప్పస్వామి జన్మనక్షత్రం ఉత్తర పాల్గుణి సందర్భంగా భక్తులు శనివారం పూజలు చేశారు.

ఐదు సంతకాలతో ప్రజలకు వెలుగులు

మంత్రి బీసీకి ఘన స్వాగతం పలికిన ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూన్ 15: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఐదు సంతకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ధర్మవరం చిన్ననాగిరెడ్డి, యువ నాయకులు ధర్మవరం గౌతమ్‌రెడ్డి, భరత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రి బీసీని భారీ గజమాలతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. పింఛన్లను రూ.4వేలకు పెంచి పేదల జీవితాలకు భరోసా కల్పించారన్నారు. సీఎం చంద్రబాబు ఉమ్మడి కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని రహదారులకు మహర్దశ వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, కొచ్చెర్వు రామాంజనేయులు, నీలం ప్రభాకర్ పాల్గొన్నారు.



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి మెమొంటో అందజేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



ర్యాలీలో మంత్రి బీసీతో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

మద్దిలేటి స్వామి ఆలయాభివృద్ధికి రూ.2.11 లక్షల విరాళం

బేతంచెర్ల, జూన్ 15: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2.11 లక్షలను ఆలయ ఈవో రామాంజనేయులుకు భక్తులు శనివారం విరాళం అందజేశారు. మండలంలోని ముద్దవరం గ్రామానికి చెందిన దివంగత అంబాపురం రంగమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు చిన్నగోవిందు, భార్య మహాలక్ష్మి రూ.1,11,116లు, అనంతపురం పట్టణంలోని కొవ్వూరు నగరం చెందిన దివంగత పసుపులేటి మద్దిలేటి, ఆయన భార్య సత్యనారాయణ జ్ఞాపకార్థం వీరి కుమారులు నాగరాజు కుటుంబ సభ్యులు రూ.1,00,116లు చెక్కును వెరసి మొత్తం రూ.2,11,232లును భక్తులు అందజేసినట్లు ఈవో తెలిపారు. స్వామి క్షేత్ర ఆదాయం రూ.8,21,0 47 భక్తుల ద్వారా లభించినట్లు తెలిపారు.



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న భక్తులు